# సంసారిముదిరి సన్యాసి

• కీ. శే. పూడిపెద్ది వెంకటరమణయ్య •

అట్టే ఆలోచించేడు దర్భం పోచలు వేళ్ళ సందున త్రిప్పుతుంటూ.

అప్పుడే ఆవిడ కోప్పడి, చీపురుకట్టతో వీపు సమ్మార్జనం చేసి చిక్కని పేడనీళ్ళు ముఖాన కలయంపి చల్లింది.

తుడుచుకుంటూ తడుముకుంటూ దర్భల వైపు నిదానించి చూస్తున్నాడు- నల్లగా మాసి కేసులు తేరి బలహీనంగా ఉన్నాయి దర్భలు, కట్టుకున్న గావంచా చినిగి మాసి ఉంది.

పండుగ ముందురోజులవి-

క్రొత్తకోకకోసం పెట్టింది మారాం. సంభావన డబ్బులన్నీ ఇచ్చేసి, ప్రీతియమయిన ఆస్తి తన పేరే వ్రాసేసి, భోజనం ఊరిమీద గడిపేసుకుంటున్నా వానికి తాపీలేదు- మూడుసందెలా ముడి వడేవేళ ఇంటికి వచ్చేడు పడుక్కుందామని. వాళ్ల తండ్రి కట్టిన యిల్లూ. పడుక్కుందికి శీతకాలంగదా- పైమీద తడుపుగావంచా దారపుపోగులు ఎడబడ్డది ఉంది ఎలాగడుస్తాడు- నలభైయేళ్ళలోపు వాడేను కామవర్ధులు.

ఇన్ని దెబ్బలూ చీవాట్లూ తిని పడుక్కుందికి జాగాకోసమే ఇల్లు చేరుతాడు- చలి ఒడలిమీద చీపురుదెబ్బలు పడ్డాయి- అవి కాస వేడెక్కిపోయని కాబోలా యిల్లాలు వెంటనే పేడనీళ్లు పోసింది మీదను-

"ఏం మొగాడు ? అలికి కోక కొనలేనివాడు? కూలివాడు నయం ఇంతకంటే-, వెచ్చగా ప్రక్క వేస్తే పడుక్కుంటారట పాపం- ఈయనకే చలి? రావద్దు- ఎందుకూ ? ఏమయితే అదే కానీ."

ఎఱ్ఱమంటి నీళ్ళతో అరుగు ఓర అలుకుతూంది ఆ గ్రుడ్డి వెలుగులో-

కామవర్ధులు లోపలకు వెళ్ళబోయాడు.

ఆదాకా ఎఱ్ఱమంటినీరూ ఆ గుమ్మంలోనే వద్దిలేసి దబదబా ఇంట్లోకి వెళ్ళి "చీర తెస్తేనే గాని చిరత తియ్య"నంటూ తలుపు మూతవేసింది.

దిగాలపడి అరుగుమీద కూలబడ్డాడు కామవర్ధులు. వానికి ఉపాయమేమీ తోచిందికాదు. ఎక్కడికేనా పోదామంటే కాళ్ళు రావు. ఈ బాధ చూస్తే విపరీతమయిపోయింది- చీకటి పడిపోయింది- అరుగు దిగి నిలబడ్డాడు కట్టు గావంచా విప్పేసి ఆ పేడుకుండలో తడిపి పిడుచుకొని కట్టుకున్నాడు- తడుపుగావంచాకూడా దానిలో పిడిచేడు-సాహసంగా దర్భలు త్రెంచి గుమ్మంలో పారేసి వెళిపోయాడు, పాపం, చలిలో వడవడా వడకుతూ.

ఈ సంగతి సుబ్బమ్మకి తెలిస్తే వానిని ఇంట్లోకి రమ్మనునేమో-ఏమో అతడు మాత్రం తొందర పడ్డాడని మనం చెప్పగలము.

## 2

ఎలాగో తెల్లవారుజాము అయేసరికి ఒక ఊరు చేరుకున్నాడు- ఆ మర్రిచెట్టు మొదట చేత్తో తుడుచుకొని, నున్నగా చేసుకొని కూర్చున్నాడు. అలసిపోయాడేమో కునుకుపాట్లు వస్తున్నాయి. చేరువ నొక సన్నయినరాయి ఉంటే తలక్రింద పెట్టుకొని పడుక్కున్నాడు-పడ్డదేపాటుగా నిద్ర పట్టిపోయింది. నిద్ర సుఖమెరగదు గదా.

నిద్రలో కలలు కంటున్నాడు- కలలో త్రుళ్ళి పడుతున్నాడు. ఏడుస్తున్నాడు, ఏమేమో యాతన పడుతున్నాడు. చలి ఒక్కతోవను వడకించేస్తూంది. పోగులు త్రెంచుకున్నాడు గాని త్రేవులు త్రెంచుకున్నాడా ?

ఇంతలో తెలివి వచ్చింది-బాగా తెల్లవారింది- ఆ చెట్టు ఆ గ్రామం చెరువు త్రోవలో ఉంది. స్నానాలు చేసి ముఖాల పసుపుపూతతో కుంకుమ బొట్లతో చేతుల సందున బిందె లిరికించుకొని కొందరు- స్త్రీలు చెరువుకు పోతున్నారు- నీళ్ళు తెచ్చుకొనుటకు-

కన్నులు విప్పి వారిని దూరాన చూచి కామవర్ధులు కాదు కాంతానందయోగి (పేరు రాత్రే మార్చుకున్నాడు——గజిటులో వెయ్యనక్కర లేదుగా) వీళ్ళ భర్త లెంత పుణ్యాత్ములో ? సాధ్వి అంటే ఇలాగుండాలి- నా చేత నీళ్ళన్నీ

* ఆనందవాణి

మాయించిందా పాడుముండ- ఎలాగో వదిలి పోయిందంటే చాలు- స్వాములవారినయిపోయాను కదా! ఒక గడియ ఈ చెట్టుక్రింద కనిపెట్టుకొని ఉంటే ఏ సాధ్వి అయినా భిక్షకు పిలుస్తుంది. ఇందరూ ప్రతిరోజూ పిలుస్తూఉంటే కొంత కాలం ఈ గ్రామంలోనే గడిచిపోతుంది. అదిగో వాళ్ళు చేరవస్తున్నారు. నిద్ర నటిస్తానని తిరగా కన్నులు మూసుకున్నాడు.

చేరవచ్చి చెట్టునూలను ముడుచుకొని పడుకొని ఉన్న శాంతానందుని చూచేరు నీలాటి రేవు అమ్మలక్కలు.

పొట్టిగా లేతగా ఉన్న ఒకలేమ ఆశ్చర్యంగా వాని నెగాదిగ చూచి "పిన్ని స్వాములవారే!" అంది.

కొంచెం ఏపరి చెంపకొప్పు సవరించుకుంటూ : ఔనే అమ్మీ! స్వాములవారే గాని...

ఏమే పిన్ని 'కాని' అని ఊరుకున్నావు, నీకు వీనిని తెలుసునా ఏమిటి?

తెలియాలటే. అన్నం అంతా పట్టి పదును చూసామా? ఒక్క మెతుకు పదునుచూస్తే చాలదటే!

ఏమిటి చూచేవో. ఏ వేషమూ లేక అంగవస్త్రమాత్రం కాషాయము కట్టుకొని చెట్టునూలను పడుకొన్న బైరాగిగదా ఇతడు.

ఔను! నీవు చూచినంతవట్టు కాతడు రోగి గాని ఇతడింకా సుకుమారజీవనాన్ని అర్థిస్తున్నాడే!

నీ కది ఎలాగు తెలుసునూ.

తలకు దిండులేనిదే పడుకొనలేకపోయినాడు. అదిగో చూడూ తలక్రింద రాయిపెట్టుకొని పడుకున్నాడు-అంది.

శాంతానందు డామాట విన్నాడు. అరరే అన్యాయముగా దొరికిపోయినానే. మొదట పాషాణంలాటి భార్య అంత చేసింది, ఇప్పుడీ పాషాణమింతచేసింది. నిజమే ఈ రాతిని తొలగించివేయాలి" అనుకొని మెల్లగా ఆ రాతిని తొలగించేడు.

అది చూచిన చేయెత్తుపాడవయిన యువతి పక్కున నవ్వి తనముందు నడుస్తూన వెనుకటి యువతి నుద్దేశించి- "చెల్లీ! వీనికి సుకుమారమే గాక పౌరుషముకూడా వదలలేదే! నీ మాటలు విని కోపపడి తలక్రింది రాతిని తొలగించేడు చూడూ" అన్నది.

శాంతానందు డావాక్యాలు విని చిన్నబోయేడు. అయ్యో! వీళ్ళందరు నన్నిస్తడించినారే-ఏం దారి. భిక్షమాట ఏమిటి? ఈ ఆకలితో నే నెక్కడకు పోయేది అనుకుంటున్నాడు. వారిలో ఒక వయసుమళ్ళిన పెద్దతరహా ఆడుది 'అమ్మీ! వీనిని భిక్షకు పిలుద్దామా? అన్నది జాలిగా.

శాంతానందుడు తన అదృష్టరేఖ బయల్పడిన దన్నట్టు లేచి కూర్చుని చేతులుచూచుకొంటున్నాడు.

ఆ పొడవరి యువతి ఆగి వాని పరిసరములు పరీక్షించి, అయ్యో, బావమ్మ-ఈతడసదండికాడు, ఇంటికి రానర్హుడుకాడే అంది.

శాంతానందుడికి సూత్రాలేం తెలుసు? చదువుకున్నాడా దేవులాటా. ఇక గత్యంతరంలేదు అని బెంబేలయిపోయినాడు. స్త్రీలకుగల విజ్ఞానం తనకులేకపోయినదే అని విచారించేడు. దిగ్గున లేచి తనువుగా మంచా మెడకు చుట్టుకొని ఆ ఆడువారియెద్దుట సాష్టాంగపడి నాకేమి ఉపాయమని జాలిగా అడిగినాడు.

ఆ పొడవరియువతి నిటారుగ నిలచి వానిని తీక్ష్ణములయిన దృష్టులతో చురచుర చూచి,

స్త్రీ సంసారమును పొందువుకొనునది, ఆ సంసారాండము పరిపక్వతకురానిదే "నీవు త్వరపడి దానిని భేదించికొని బైటపడి అణూరువుడవయినావు! అయ్యా! నీకొక్కటే పాఠము చెప్పుచున్నాను. వినుము. సంసారి ముదురుతేగాని సన్యాసికాలేడు. ఇదే దీని రహస్యము. నీవింకను కొంతకాలము సంసారము గడపి మరీ సన్యాసివి కావలెనని గుర్విలాగు గ్రుక్కతిప్పకుండా సన్యాసతత్త్వం వారికి బోధపరచింది.

చేయునదిలేక శాంతానందుడు కామవరుఘులయి ఇలుచేరేడు.

వీని నారుఢపతితుడంటారా?

[పూర్వగాథ ననుసరించి వెంచినది]

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras
and published by V. KALIDAS, at 15 Thambu Chetty Street, Madras
Editor: V. KALIDAS, Associate Editors Andra Seshagiri Rao B.A. Mudde Viswanadham